గణపతి ఉత్సవాలకు కేరాఫ్ పాతబస్తీ

- ఆరు దశాబ్దాలుగా ఉత్సవాలను నిర్వహిస్తున్న సంస్థలు
- తరాలు మారినా కొనసాగుతున్నా ఉత్సవాలు
- ఏటా చవితి ఉత్సవాలతో కళకళలాడుతున్న పాతబస్తీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): గణపతి ఉత్సవాలకు నగరంలోని పాతబస్తీ కేరాఫ్ అడ్రస్‌గా నిలుస్తోంది. నగరంలోని పాతబస్తీలో సుమారు 65 ఏళ్లగా వివిధ సంఘాల ఆధ్వర్యాన వినాయక చవితి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. పాతబస్తీ అంటే ఇరుకు వీధులు, వేలాది వ్యాపార సంస్థలు కనిపిస్తుంటాయి. చవితి వేడుకలకు మాత్రం పాతబస్తీలో ఎటు చూసినా గణపతి... ఉత్సవాలే దర్శనమిస్తాయి. కొత్త రాష్ట్రంలో భారీగా గణపతి ఉత్సవాలను విజయవాడ పాతబస్తీలోనే నిర్వహించడం విశేషం. ఏటా వినాయక చవితి వేడుకల్లో భాగంగా పండుగ నుంచి 11 రోజుల పాటు పాతబస్తీలోని ప్రముఖ కూడళ్లు పండుగ వాతావరణతో కళకళలాడుతూ ఉంటాయి. 'పశ్చిమ'లో సుమారు వందకుపైగా హోల్‌సేల్ సంఘాలు ఇవి కాకుండా. స్థానిక చవితి వేడుకలను భారీ ఉత్సవంగా నిర్వహిస్తున్నారు. హైదరాబాద్ తరువాత విజయవాడలోనే వినాయకచవితి వేడుకలు భారీగా జరుగుతుంటాయి.

మూడో తరం నిర్వాహకులు..

సుమారు ఆరు దశాబ్దాలుగా గణపతి ఉత్సవాలను క్రమంతప్పకుండా పలు సంస్థలు కొనసాగిస్తున్నాయి. వస్త్ర వ్యాపారానికే కేంద్రమైన పాతబస్తీలో 58 ఏళ్ల పైనుంచి గణపతి ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. కరోనా సమయంలో మాత్రమే ఉత్సవాలను ఆపారు. ఇక్కడ 60వ దశకం నుంచి క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ ఉత్సవాలను నిర్వహిస్తోంది. పాతబస్తీలో మరో ప్రముఖ ఉత్సవ కమిటీ పూలబావి వీధిలోని పాలకవర్గం. ఇక్కడ 59 సంవత్సరాల నుంచి క్రమం తప్పకుండా ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. ఇక్కడ రెండు తరాలకు చెందిన పెద్దలు ఉత్సవ బాధ్యతలు నిర్వహించారు. ఇప్పుడు స్థానికంగా ఉంటున్న మూడో తరం నిర్వాహకులుగా మారారు. అక్కడే వ్యాపార కేంద్రాలైన మెయిన్‌బజార్, శివాలయంవీధి, గుడివాడవారి వీధి తదితర ప్రాంతాల్లోని వివిధ సంఘాలు సైతం నాలుగున్నర దశాబ్దాలుగా ఉత్సవాలను నిర్వహిస్తున్నాయి. కందులవారి వీధిలోని గణేష్ ఉత్సవ సమితి(మార్వాడీ సంఘం), కొత్తగుళ్ల సమీపంలోని బాలగణపతి సేవా సమితి తదితర సంఘాలు సైతం సుమారుగా నాలుగు దశాబ్దాలుగా ఉత్సవాలు నిర్వహిస్తున్నాయి.



పూలబావి వీధిలో ఏర్పాటు చేసిన విఘ్నేశ్వరుడు



వస్త్రలతలో ఏర్పాటు చేసిన భారీ గణనాథుడు

పోటాపోటీగా ఉత్సవాలు

గణపతి ఉత్సవాల నిర్వాహకులు పోటాపోటీగా ఏర్పాట్లు చేస్తూ అందరినీ ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఏటా ఏదొక కొత్త అంశాన్ని ఏర్పాటు చేస్తున్నారు. ఈ ఏడాది వస్త్రలత ప్రాంగణంలో గోల్డెన్ టెంపుల్ మహాలక్ష్మి అమ్మవారిని తలపించేలా నమూనాలను ఏర్పాటు చేశారు. అలాగే పూజారి వారి వీధిలోని శ్రీ బాలగణపతి మందిరం ఆధ్వర్యంలో జరుగుతున్న వేడుకల్లోనూ అద్దాలతో ప్రత్యేకంగా గణపతిని రూపొందించి స్వామి వారిని ఏర్పాటు చేశారు. అలాగే ఆయా పందిళ్ల నిర్వాహకులు ఏదోక విభిన్నరీతిలో భక్తులను ఆకట్టుకునేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తున్నారు. వేడుకలకు వన్నె తెస్తున్నారు. భక్తులను అలరిస్తున్నారు.

మిత్ర బృందంతో కొనసాగుతున్నాం



గడిచిన 40 ఏళ్లగా మా మిత్రులందరం కలిసి భారీగా గణపతి ఉత్సవాలను నిర్వహిస్తున్నాం. మా తండ్రి గారు, వారి మిత్రబృందం ఆధ్వర్యంలో ఉత్సవాలను ప్రారంభించారు. అందరం వివిధ వృత్తుల్లో స్థిరపడినా ఉత్సవాలను ఆపకుండా ప్రతి ఏటా చేస్తున్నాం. మా మధ్య బంధం గట్టిపడటమే కాకుండా ఆధ్యాత్మిక చింతనను సైతం ఈ ఉత్సవాలను పెంచాయి.

– గ్రంథి శ్రీనివాసరావు, అధ్యక్షుడు, శ్రీ బాలగణపతి మందిరం

మాకు చాలా సెంటిమెంట్..



వస్త్ర దుకాణ సముదాయంలో వినాయకచవితి ఉత్సవాలు మాకు చాలా సెంటిమెంట్. ప్రతి ఏటా ఉత్సవాలను మేం నిర్వహిస్తున్నాం. సుమారు అర్ధ శతాబ్దానికి పైగా వస్త్రలత ప్రాంగణంలో ఉత్సవాలు కొనసాగుతున్నాయి. అలాగే కృష్ణవేణి మార్కెట్‌లోనూ దశాబ్దాలుగా ఉత్సవాలను నిర్వహిస్తున్నాం. మా సంఘం పూర్వ పెద్దలు ఆ రోజుల్లో ఈ ఉత్సవాలను ప్రారంభించారు. ఆ ఆనవాయితీని కొనసాగిస్తున్నాం.

– బచ్చు వెంకటప్రసాద్, ప్రధాన కార్యదర్శి, ఏపీ టెక్స్‌టైల్ ఫెడరేషన్

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): భవానీపురం పరిధిలోని 11 కేవీ హౌసింగ్‌బోర్డ్‌కాలనీ ఫీడర్ విద్యుత్ లైన్ల మరమ్మతుల్లో భాగంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీసీపీడీసీఎల్ కార్యనిర్వాహక ఇంజినీర్ పి.రవీంద్రబాబు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని హెచ్ఐజీలు, హెచ్ఆర్‌టీ, రిలయన్స్ స్మార్ట్ వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తామన్నారు. ఆయా ప్రాంతాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

సాయిబాబా మందిరంలో హోమాలు



భవానీపురం(విజయవాడపశ్చిమ): గణపతి నిమజ్జనం సందర్భంగా భవానీపురం హౌసింగ్‌బోర్డ్‌కాలనీలోని సంకల్ప సిద్ధి శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో ఆదివారం లక్ష్మీగణపతి, నవగ్రహాలు, దత్తాత్రేయ స్వామి, సాయిబాబా, శాంతి హోమాలు నిర్వహించారు. భక్తులు హోమాలకు భక్తిశ్రద్ధలతో నమస్కరించి తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాన్ని స్వీకరించారు. అనంతరం మందిరంలో ఏర్పాటు చేసి పూజలు చేసిన వినాయక విగ్రహాన్ని కృష్ణానదిలో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో మందిరం పాలకవర్గం అధ్యక్షుడు బూర్లె వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు మోటుమర్రి సుబ్బారావు, సంయుక్త కార్యదర్శి పెండేల వెంకటలక్ష్మీ ప్రసాద్, సభ్యులు పోతార్లంక రజనీకాంత్, గురజపల్లి కృష్ణ, యెనిగళ్ల సుబ్బారావు, సాయి సేవకులు పాల్గొన్నారు.

గ్రామ కమిటీ నాయకులతో పార్టీ బలోపేతం



భవానీపురం(విజయవాడపశ్చిమ): జక్కంపూడి వైఎస్సార్ కాలనీని ఒక విలేజీగా తీసుకుని గ్రామ కమిటీలను ఏర్పాటు చేయాలని, తద్వారా కమిటీ నాయకులతో పార్టీని మరింత బలోపేతం చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ విజయవాడ రూరల్ మండల అధ్యక్షుడు బయ్యారపు రవికిషోర్ పేర్కొన్నారు. వైఎస్సార్ కాలనీలో ఆదివారం నిర్వహించిన పార్టీ విస్తృత సమావేశంలో ఆయనతో పాటు ఎంపీటీసీలు షేక్ సైదాబీ హిమవలి, కొరగంజి సత్యనారాయణ, బయ్యారపు కల్పన పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవికిషోర్ మాట్లాడుతూ ఈ నెల 2న దివంగత మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని తీర్మానించామన్నారు. వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ ప్రకటించినట్లుగా క్రమశిక్షణ కలిగిన కార్యకర్తలే పార్టీకి వెన్నుముకలని, భవిష్యత్‌లో వారే నాయకులుగా ఎదుగుతారని అన్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి కష్టపడిన, క్రమశిక్షణ కలిగిన వారిని అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులు తదితర పార్టీ పదవులలో నియమించనున్నట్లు తెలిపారు. పార్టీ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అందరూ కలిసికట్టుగా ఉంటూ అధికార కూటమి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలు, అన్యాయాలను ఎదుర్కోవాలని కోరారు. అంబేడ్కర్ రాజ్యాంగాన్ని తుంగలోతొక్కి రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలుచేస్తూ పార్టీ నేతలు, నాయకులపై అక్రమ కేసులు బనాయించి జైళ్లలో పెట్టటాన్ని తీవ్రంగా ఖండించారు. కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలోనే ప్రజావ్యతిరేకతను మూటకట్టుకుందని, భవిష్యత్‌లో వైఎస్ జగన్ మళ్లీ రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడం తథ్యమని చెప్పారు.

నేడు వీఎంసీలో పీజీఆర్ఎస్

పటమట(విజయవాడతూర్పు): విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలోని ఆయా డివిజన్లలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించేందుకు వీఎంసీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజా ఫిర్యాదులు–పరిష్కార కార్యక్రమం నిర్వహిస్తున్నామని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. ఈ కార్యక్రమంలో వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్‌తో పాటు వీఎంసీ సర్కిల్ కార్యాలయాల్లో కూడా జరుగుతుందన్నారు. చిట్టినగర్‌లోని సర్కిల్–1 కార్యాలయంలో, సత్యనారాయణపురంలో సర్కిల్–2 కార్యాలయంలో, పటమటలోని సర్కిల్–3 కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరుగుతుందని తెలిపారు. ఆయా ప్రాంతాల్లోని సమస్యలను అధికారుల దృష్టికి నేరుగా తీసుకువచ్చి సమస్యలు పరిష్కరించుకోవాలని సూచించారు.

ఆర్చరీలో సత్తా చాటిన కేఎల్‌యూ విద్యార్థిని



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆర్చరీ విభాగంలో విశేష ప్రతిభను చాటుతున్న కేఎల్ డీమ్డ్ యూనివర్సిటీ విద్యార్థిని తాడిబోయిన భువన రాజేశ్వరిని ఇటీవల రాష్ట్ర క్రీడా సదస్సులో సీఎం చంద్రబాబు అవార్డు ఇచ్చి సత్కరించారు. ఈ నేపథ్యంలో వర్సిటీలో రాజేశ్వరిని శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా అడ్మిషన్ల డైరెక్టర్ డాక్టర్ జె.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజేశ్వరి ఆర్చరీ క్రీడలో సాధించిన విజయాలు తమ యూనివర్సిటీకి గర్వకారణమన్నారు. ఆమె భవిష్యత్తులో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

ఘనంగా వినాయక చవితి ఉత్సవాలు



భవానీపురం బ్యాంక్ సెంటర్‌లో అన్నదానం చేస్తున్న వెలంపల్లి



పాత హౌసింగ్ బోర్డు కాలనీలో వేడుకలు



ఆంజనేయవాగు పూజల్లో పాల్గొన్న వెలంపల్లి

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గ వ్యాప్తంగా గణపతి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. పలు ప్రాంతాల్లో ఆదివారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. గణనాథులను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలని ప్రారంభించి భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు. 53వ డివిజన్ దూది ఫ్యాక్టరీ సందు వద్ద శ్రీ విఘ్నేశ్వర సేవా సమితి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన పూజ కార్యక్రమంలో పాల్గొని, అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. గురుమహంతు మహేష్ తదితరులు పాల్గొన్నారు. స్థానిక 51వ డివిజన్ వాగు సెంటర్ వద్ద శ్రీ మహా గణపతి ఫ్రెండ్స్ సర్కిల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన పూజ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. తుపాకుల గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు. 52వ డివిజన్ పాతిన వారి వీధి వద్ద శ్రీ విఘ్నేశ్వర సేవా సమితి వారి ఆధ్వర్యంలో నిర్వహించిన పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

భవానీపురం వ్యాప్తంగా..

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): భవానీపురం ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్ టీటీఐఏ స్కూల్ వద్ద విజయ గణపతి సేవా సమితి ఆధ్వర్యంలో చవితి మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు. గణపతి పూజ నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. భవానీపురం బ్యాంక్ సెంటర్ వద్ద మెగా ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకల్లో మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. పార్టీ నాయకులు జవ్వాజి వెంకటరావు, కొండలరావు, ఇండ్ల నరసింహారావు, కేసరి కృష్ణారెడ్డి, సాంబిరెడ్డి, రాజశేఖరరెడ్డి, నారాయణరెడ్డి, నాగార్జున, యూత్ సభ్యులు పాల్గొన్నారు. ఊర్మిళానగర్ రెడ్డి కాలనీ వద్ద హనుమాన్ ఫ్రెండ్స్ సర్కిల్, విఘ్నేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో చవితి వేడుకల్లో వెలంపల్లి పాల్గొన్నారు. కార్పొరేటర్ బాపతి కోటిరెడ్డి హనుమాన్ ఫ్రెండ్స్ సర్కిల్, విఘ్నేశ్వర సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు. పాత హౌసింగ్ బోర్డ్ కాలనీలోని శ్రీ బాల గణేష్ సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వేడుకలు ఆదివారంతో ముగిశాయి. భక్తులకు అన్నదానం చేసి, స్వామివారిని నిమజ్జనం చేశారు.

జిల్లాలకు మహనీయుల పేర్లు పెట్టాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సమాజ సేవకు జీవితాన్ని అంకితం చేసిన వారి పేర్లను జిల్లాలకు పెట్టాలని సోషల్ జస్టిస్ ఫోరం, కాపు ఐక్యవేదిక, బీసీ ఐక్యవేదికలు డిమాండ్ చేశాయి. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో సోషల్ జస్టిస్ ఫోరం కన్వీనర్ రావి శ్రీనివాస్ మాట్లాడుతూ.. జీవిత సర్వస్వాన్ని సమాజ సేవకు అంకితం చేసిన మహనీయుల పేర్లు జిల్లాలకు పెట్టడం సముచితమన్నారు. ఆ దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

శ్రీకాకుళం – సర్దార్ గౌతు లచ్చన్న శ్రీకాకుళం జిల్లా, కృష్ణా – వంగవీటి మోహన్ రంగా కృష్ణా జిల్లా, గుంటూరు – గుర్రం జాషువా గుంటూరు జిల్లా, పల్నాడు – కన్నెగంటి హనుమంతు పల్నాడు జిల్లా, కర్నూలు – దామోదరం సంజీవయ్య కర్నూలు జిల్లా, అనంతపురం – శ్రీకృష్ణదేవరాయ అనంతపురం జిల్లాగా నామకరణం చేయాలని కోరారు. ఆయా జిల్లాలకు మహనీయుల పేర్లు పెట్టడం ద్వారా సామాజికవర్గాల ఆత్మ గౌరవం, ఆత్మాభిమానం ఇనుమడిస్తాయన్నారు. తక్షణమే ఆయా జిల్లాలకు ఆయా పేర్లు పెట్టాలని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జంగాల సింగరయ్య యాదవ్, మాసాబత్తుల శ్రీనివాస్, దానగౌడ్, బొడపాటి పెద బాబు, కాకిలేటి హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

మైనార్టీలకు అండగా ఉన్న నేత వైఎస్ జగన్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలో ముస్లిం మైనార్టీల సంక్షేమానికి అండగా నిలిచింది మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు అన్నారు. పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ సహాయ కార్యదర్శిగా నియమితులైన షేక్ మొహమ్మద్ బషీర్ అహ్మద్ వెలంపల్లిని ఆయన కార్యాలయంలో ఆదివారం కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు వెలంపల్లి, బషీర్ అహ్మద్‌లను సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కూటమి ప్రభుత్వం ముస్లింలకు చేస్తున్న అన్యాయాలను ప్రజలకు వివరించాలని సూచించారు. అనంతరం ముస్లిం మత పెద్దలు నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్నారు. కార్యక్రమంలో నేతలు దాసి జయప్రకాష్‌కెనడీ, పాదిలి చంటి తదితరులు పాల్గొన్నారు.

24న విజయవాడ ధర్నా చౌక్‌లో దళిత రణభేరి

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్ కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న బందెల గౌతమ్ కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్రంలో దళితులపై హత్యలు, అత్యాచారాలు పెరిగిపోయాయని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్ కుమార్ అన్నారు. దళితులపై అత్యాచారాలకు వ్యతిరేకంగా బీఎస్పీ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 24న విజయవాడ ధర్నా చౌక్‌లో దళిత రణభేరి పేరిట నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఆదివారం విజయవాడలోని బీఎస్పీ కార్యాలయంలో అసెంబ్లీ నియోజకవర్గాల ఇంచార్జిల సమావేశం జరిగింది. తొలుత మహాత్మా జ్యోతిరావు పూలే, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. సమావేశంలో పుష్పరాజు, రాష్ట్ర కోఆర్డినేటర్ బాలయ్య, వైస్ ప్రెసిడెంట్ జానకి ప్రసాద్, ప్రధాన కార్యదర్శులు గద్దం సంపత్ రావు, గొల్లబత్తుల సత్యం, పి.గురప్ప, గుమ్మాపు చిత్ర శీను, తిరుపతిరావు, రాష్ట్ర కార్యదర్శులు చిన్ననూరు నాగరాజు, పంపావతులు గోవిందు, ప్రకాష్ రావు, మురాల రత్నరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు రూ.25 వేల ఆర్థిక సాయం ఇవ్వాలి



ధర్నాలో మాట్లాడుతున్న యూనియన్ నాయకులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఉచిత బస్ పథకంతో ఆటో కార్మికుల జీవనోపాధికి గండి పడిందని, తమను ఆదుకుంటామని చంద్రబాబు ప్రకటించారు తప్ప ఇంత వరకు ఎటువంటి సాయం చేయలేదని విజయవాడ సిటీ ఆటో వర్కర్స్ యూనియన్(సీఐటీయూ) నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఆటో కార్మికులకు రూ.25 వేలు ఆర్థిక సహాయం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు విద్యాధరపురం సితార జంక్షన్‌లో ఆదివారం ధర్నా నిర్వహించారు. యూనియన్ నగర నాయకులు ఎం.హనుమంతరావు, ఎస్‌డీ కరీముల్లా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్ పథకానికి తాము వ్యతిరేకం కాదన్నారు. అయితే ఆటో కార్మికులు ఉపాధిని ఆ పథకం దారుణంగా దెబ్బతీసిందని, కుటుంబం గడవటం కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వైపు ఆటో ఫైనాన్స్ కిస్తీలు కట్టలేక, మరో వైపు పెరిగిన పెట్రోల్/డీజిల్ ఖర్చులు, మరమ్మతుల ఖర్చులు పెరిగిపోయి దిన దిన గండంగా ఉందన్నారు. ఇప్పటికైనా బ్యాడ్జితో సంబంధం లేకుండా ప్రతి ఆటో కార్మికునికి ఏడాదికి రూ.25 వేలు అందించాలని, సంక్షేమ బోర్డ్‌ను ఏర్పాటు చేయాలని, సీఎన్‌జీ ఆటోలకు గ్యాస్ ఫిల్లింగ్‌పై సబ్సిడీ అందించాలని, ఆర్టీఓ సేవల ప్రైవేటీకరణ ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కృష్ణ, తులసి, చంటి, మస్తాన్, పెద్ద సంఖ్యలో ఆటో కార్మికులు పాల్గొన్నారు.

అర్ధనారీశ్వరునిగా శ్రీబాలగణపతి దర్శనం



సామూహిక లక్ష బిల్వార్చనలో పాల్గొన్న దంపతులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలోని శ్రీ బాలగణపతి స్వామివారు శ్రీ అర్ధనారీశ్వర గణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. వన్‌టౌన్ పూజారి వారి వీధిలోని శ్రీ బాలగణపతి మందిరంలో జరుగుతున్న వినాయకచవితి నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారికి విశేష అలంకారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాత సేవతో వైదిక కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం సహస్ర నామార్చనను నిర్వహించారు. అలాగే సామూహిక లక్ష బిల్వార్చన వైభవంగా జరిగింది. బిల్వార్చనలో అధిక సంఖ్యలో దంపతులు పాల్గొన్నారు. అదేవిధంగా స్వామివారికి ఉదయం, సాయంత్రం సహస్ర మోదక (ఉండ్రాళ్ల) పూజలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

సందడిగా కోలాట పోటీలు

ఉత్సవాల్లో భాగంగా స్వామి వారి సన్నిధిలో కోలాట పోటీలను నిర్వహించారు. రోటరీ క్లబ్ ఆఫ్ విజయవాడ మిడ్‌టౌన్ సౌజన్యంతో ఈ పోటీలను నిర్వహించారు. పలువురు మహిళా సంఘాలు ఈ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నాయి. అదేవిధంగా ఊరేగింపు పాటలను నిర్వహించారు. పలువురు ప్రముఖులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. కార్యక్రమాలను కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గ్రంథి శ్రీనివాసరావు, మామిడి వెంకటకృష్ణారావు తదితరులు నిర్వహించారు.

గణనాథులకు ఘనంగా వీడ్కోలు



నిమజ్జనానికి తరలివెళ్తున్న కృష్ణవేణి హోల్‌సేల్ మార్కెట్‌లోని గణనాథుడు



నిమజ్జనానికి తరలిస్తున్న వినాయక విగ్రహాలు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీలో వినాయకచవితి వేడుకలను పురస్కరించుకొని గణనాథుల నిమజ్జన ఊరేగింపులు ఆదివారం సందడిగా కొనసాగాయి. పాతబస్తీ, కొత్తపేట, మల్లికార్జునపేట, తారాపేట, ఇస్లాంపేట తదితర ప్రాంతాల్లో వినాయకచవితి ఉత్సవ పందిళ్ల నుంచి విగ్రహాల నిమజ్జన ఊరేగింపులు కోలాహలంగా కదిలాయి. పాతబస్తీలోని కేటీరోడ్డు, బాబూరాజేంద్రప్రసాద్ రోడ్డు, కోమలవిలాస్ సెంటర్, నెహ్రూబొమ్మ సెంటర్, గణపతిరావురోడ్డు, బ్రాహ్మణవీధి తదితర ప్రాంతాలన్ని నిమజ్జన ఊరేగింపులతో సందడిగా మారాయి. సాయంత్రం ప్రారంభమైన ఊరేగింపుల హడావుడి అర్ధరాత్రి దాటినా కొనసాగుతూనే ఉంది. పలువురు ప్రముఖులు ఆయా ఊరేగింపుల్లో పాల్గొని ప్రారంభించారు. కృష్ణవేణి హోల్‌సేల్ మార్కెట్‌లోని స్వామి వారి ఊరేగింపును ఆ సంఘం అధ్యక్షుడు బచ్చు వెంకటప్రసాద్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అలాగే ఆ సంఘం పాలకవర్గ సభ్యులు, ముఠా కార్మికులు, గుమాస్తాలు తదితరులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మహంతీపురంలో ఏర్పాటు చేసిన గణనాథుడి ఊరేగింపు వివిధ ప్రాంతాల మీదుగా ముందుకు సాగింది. పాతబస్తీలో జరిగిన పలు చవితి వేడుకల్లో వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొని పూజలు నిర్వహించారు.

కోలాహలంగా ఊరేగింపు..

భవానీపురం(విజయవాడపశ్చిమ): వినాయక నిమజ్జనోత్సవాలు ఆదివారం కోలాహలంగా జరిగాయి. విద్యాధరపురం కబేళా రోడ్‌లోని మిథిలానగర్ ఓనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో ఉదయం శ్రీలక్ష్మీ గణపతి హోమం, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి లడ్డూ ప్రసాదం వేలం, అన్నప్రసాద వితరణ జరిగింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేత వెలంపల్లి శ్రీనివాసరావు పాల్గొని భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. సాయంత్రం స్వామివారిని కాలనీ వీధుల్లో ఊరేగించి కృష్ణానదికి తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు పరిమి మల్లేశ్వరరావు, కమిటీ సభ్యులు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

టీచర్స్‌కాలనీలో గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో...

భవానీపురం టీచర్స్‌కాలనీలో గణేష్ ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్సవాల్లో ప్రత్యేక పూజలు చేశారు. లడ్డూ ప్రసాదాన్ని వేలం వేయగా 35 కేజీల లడ్డూను కె.మాధవరెడ్డి రూ.32,516, 10 కేజీల లడ్డూను ఎస్.సుబ్బారావు రూ.11.300, 5 కేజీల లడ్డూను రూ.17 వేలకు లలిత్ కుమార్ దక్కించుకున్నారు. అలాగే స్వామివారి మెడలో వేసిన రూ.10 నోట్ల దండను రేవంత్ రాజు రూ.9 వేలకు, రూ.20 నోట్ల దండను టీ స్టాల్ కుమార్ రూ.10,100లకు దక్కించుకున్నారు. రాత్రి స్వామివారిని పురవీధుల్లో ఊరేగించి కృష్ణానదికి తీసుకువెళ్లి నిమజ్జనం చేశారు.



భవానీపురం టీచర్స్‌కాలనీలో వినాయక విగ్రహం ఊరేగింపు

బుడమేరు ముంపు నివారణకు తీసుకున్న చర్యలేమిటి?

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): గతేడాది జలప్రళయం సృష్టించిన బుడమేరు వరద ముంపు నివారణకు కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలేమిటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు ప్రశ్నించారు. ఆదివారం ఆయన విడుదల చేసిన ఓ ప్రకటనలో బుడమేరు బాధితుల తరఫున ప్రభుత్వానికి పలు ప్రశ్నలు సంధించారు. వరద ముంపు నివారణకు బడ్జెట్‌లో ఎంత నిధులు కేటాయించారు? ఎంత ఖర్చు పెట్టారు? కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన రూ.6,880 కోట్లలో ఎంత నిధులు వచ్చాయి? 25 కిలోమీటర్ల పొడవున సమాంతరంగా మరొక కాలువ నిర్మించాలనే ప్రతిపాదనకు పరిపాలనాపరమైన అనుమతులు ఇచ్చారా? నిధులు కేటాయించారా? కృష్ణానది తరహాలో బుడమేరుకు రక్షణ గోడలు నిర్మాణానికి అనుమతులు ఇచ్చారా? వెలగలేరు రెగ్యులేటర్ సామర్థ్యం పెంపు ప్రతిపాదనలు ఏ దశలో ఉన్నాయి? కృష్ణానదిలో కలిసే బుడమేరు డైవర్షన్ చానల్ సామర్థ్యం 15వేల క్యూసెక్కుల నుంచి 37,500 క్యూసెక్కులకు పెంపునకు ఏం చర్యలు తీసుకున్నారు? వివిధ ప్రాంతాలలో 16 చోట్ల గండ్లు పడితే ఎన్ని చోట్ల పూడ్చారు? కొండపల్లి శాంతినగర్ వద్ద గండి పూడ్చడం తప్ప 64 కిలోమీటర్ల పొడవున ఉన్న చానల్‌కు రక్షణ గోడల నిర్మాణం జరిగిందా? అంటూ ప్రభుత్వానికి ప్రశ్నలు సంధించారు. తమ ప్రశ్నలకు సీఎం చంద్రబాబు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా శాశ్వత చర్యలు చేపట్టాలని, వరద ముంపు నుంచి శాశ్వతంగా రక్షణ కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.